క్లుప్తంగా

బాలికల అభ్యున్నతే లక్ష్యం


ర్యాలీలో పాల్గొన్న బాలికలు

గాలివీడు: లింగ వివక్షను రూపుమాపి బాలికల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సోనీ, అరుణకుమారి పిలుపునిచ్చారు. భేటీ బచావో భేటీ పడావో మండల కేంద్రంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల లింగ నిష్పత్తిని మెరుగుపరచాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం


డీలర్ సరఫరా చేసిన మగ్గిన బియ్యం

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయితీ దళిత వాడలో మగ్గిన, మట్టి రంగు రేషన్ బియ్యం పంపిణీ చేయడం డీలర్ల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందని మండల సీపీఐ కార్యదర్శి దార్లరాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బియ్యం పంపిణీని అడ్డుకున్న ఆయన మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చడానికి రేషన్ షాపుల ప్రాధాన్యం మెరుగుపరచాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి అర్బన్: ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పోతగాల్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది కనిపించలేదని తెలిపారు. మదనపల్లె జ్ఞానాంబిక జూనియర్ కళాశాల కేంద్రంగా పరీక్ష జరుగుతుండగా, హాల్ టికెట్‌లో ఆర్టీసీ బస్టాండు వద్ద అని సూచించారన్నారు. పరీక్ష ప్రశాంత్‌నగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్నారన్నారు. జ్ఞానాంబిక, నారాయణ జూనియర్ కళాశాలలు రెండు కేంద్రాలయితే ఒకే భవనంలో నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. భారతి జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు, నీటివసతి, పార్కింగ్ సమస్యలు ఉన్నాయని తెలిపారు. కాలేజీ కాంప్లెక్స్‌లో జిరాక్స్, నోటరీ దుకాణాలు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

3 నుంచి పోలేరమ్మ తిరునాల

గాలివీడు: మండలకేంద్రంలోని శెట్టివారిపల్లెలో వెలసిన పోలేరమ్మ తిరునాల ఈ నెల 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ 3న సద్దలకూడు నైవేద్యంతో అమ్మవారి జాతరకు అంకురార్పణ జరుగుతుందని, రాత్రి చెక్క భజన, చాందినీ బండ్లతో గ్రామోత్సవం ఉంటాయని తెలిపారు. 4న ఉదయం అమ్మవారికి బోనాలు, సాయంకాలం అసాధుని కథ ఉంటాయని తెలిపారు. జాతరను పురస్కరించుకుని గ్రామస్థులు వగ్గం మల్లికార్జున, అంజినమ్మ దంపతులు మకర తోరణంతో కూడిన రెండు అడుగుల అమ్మవారి ఉత్సవమూర్తి, చెన్నూరు రమణమ్మ కుటుంబ సభ్యులు త్రిశూలాన్ని అమ్మవారికి విరాళంగా అందజేశారు.

వినతులను పరిష్కరించండి

పెనగలూరు: రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు అమరేశ్వరి కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఫైల్స్ పెండింగ్‌లో ఉంటే ఈ నెల 10వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, బృంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

సుండుపల్లె: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్కూల్ పిల్లలు, బాలికలకు పోలీసుల విధులు, రికార్డులకు ఉపయోగించే వస్తువుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేయాలి

రాయచోటి అర్బన్: రామచంద్రరాజు కమిషన్ సూచన మేరకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో అమర వీరుల సంస్మరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. అమరవీరుల ఫ్లెక్సీకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎందరో మాదిగవీరులు ప్రాణ త్యాగం చేసి అమరులయ్యారన్నారు. ఒకొక్కక్క అమరవీరుడి కుటుంబీకులకు రూ.25 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. హరిబాబు, తాతయ్య, పామయ్య, సాయికుమార్, బసవయ్య, వండాడి రమణ, సురేంద్ర, చంద్ర పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర


సంతానం కోసం అమ్మవారికి సాష్టాంగ నమస్కారం చేస్తున్న మహిళలు


గంగమ్మ జాతరలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


గంగమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు


అమ్మవారిని దర్శించుకుంటున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

లక్కిరెడ్డిపల్లి: మండలంలో అనంతపురం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. వేలాది జనం అమ్మవారిని దర్శించుకున్నారు. చెరుకురసాల బండ్లు, డప్పు వాయిద్యాలు ఆకర్షణగా నిలిచాయి.

వైభవంగా బండలాగు పోటీలు

మండలంలోని అనంతపురం గంగమ్మ జాతరలో భాగంగా శనివారం బండలాగుడు పోటీలను టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గంగమ్మ జాతరలో బండలాగుడు పోటీలు నిర్వహించడం ప్రాచీన సంప్రదాయమన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.1,00,000, రూ.80 వేలు, రూ.60 వేలు రూ.40 వేల నగదు బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో మదన్‌మోహన్, ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గంగమ్మ దేవతకు పట్టు వస్త్రాలు

అనంతపురం గంగమ్మ తల్లికి శనివారం రాత్రి రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి శ్రీనివాసులు, పూజారులు చల్ల గంగరాజులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ కుటుంబ సభ్యులతో గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. అలాగే జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు,ఆర్డీఓ శ్రీనివాసులు గంగమ్మతల్లిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు


ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

రాజంపేట టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి నగదు రికవరీ చేస్తామని డ్వామా పీడీ వెంకటరత్నం హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 25 పంచాయితీల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై పీడీ సమీక్షించారు. ఆయా పంచాయితీల్లో చేపట్టిన పనులు, ఖర్చుల వివరాలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఎవరైనా పనులు కల్పించలేదని ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఎక్కడెక్కడ పనులు చేపట్టాలో ముందుగానే గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.వరప్రసాద్, ఏపీడీ ప్రతాప్, ఏపీఓ సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 36 మినీ గోకులాలు మంజూరు


అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ రమాదేవి

సిద్దవటం: సిద్దవటం మండలానికి 36 మినీ గోకులాలు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ భాకరాపేటలో అంగన్ వాడీ కేంద్రాన్ని ఎత్తివేశారని పెద్దపల్లె ఎంపీటీసి రమాదేవి తెలుపగా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీవిద్య మాట్లాడుతూ సిబ్బంది కోర్టుకు వెళ్లడంతో బెటాలియన్ అంగన్‌వాడీ సెంటర్‌కు తరలించామన్నారు. పశు వైద్యుడు డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ కోళ్లతో బర్డ్‌ఫ్లూ వస్తుందని బయాందోళన చెందవద్దని, ఉడికించి తినవచ్చునని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్ మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి సమస్యలేకుండా చర్యలు చేపడతామన్నారు. హౌసింగ్ ఏఈ చెన్నయ్య మాట్లాడుతూ సిద్దవటం మండల వ్యాప్తంగా 447 పక్కా గృహాల నిర్మాణం పెండింగ్‌లో ఉందని, 2026 మార్చి లోగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజ్యలక్ష్మి, మెహతాబ్ యాస్మిన్, రమేష్‌రెడ్డి, నాగరాజు, నరసింహులు, జయచంద్ర, రమాదేవి, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, సర్పంచులు ఈశ్వర్‌రెడ్డి, చంద్రకళ, చిన్నక్క, మరికొందరు అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.16 లక్షలు


నగదు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

రాజంపేట రూరల్: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షి సమేత త్రేత్రేశ్వర స్వామికి హుండీ, టికెట్లు, విరాళాల రూపంలో రూ.16,77,162 ఆదాయం వచ్చిందని జిల్లా దేవదాయశాఖ అధికారి సి.విశ్వనాథ్, ఈవో గంగవరం కొండారెడ్డి తెలిపారు. ఆలయంలో హుండీ, తదితర వాటిని శనివారం లెక్కించారు. వారు మాట్లాడుతూ టెంకాయల విక్రయ వేలం ద్వారా రూ.7,10,000, స్వామి హుండీ ద్వారా రూ.5,86,229, దర్శన టికెట్ల నుంచి రూ.3,50,600ల ఆదాయం వచ్చిందన్నారు. త్రేతేశ్వరస్వామి కల్యాణానికి భక్తుల చదివింపుల రూపంలో రూ.30,333 అందజేశారన్నారు. బ్రహ్మోత్సవాలలో సహకరించిన నాయకులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్‌రెడ్డి, కె. పద్మనాభ శాస్త్రి, పోలి సుధీష్ రెడ్డి, లక్ష్మయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో సీపీఐ శత జయంతి ఉత్సవాలు




మాట్లాడుతున్న పీఎల్.నరసింహులు

రాయచోటి అర్బన్: ఈ నెల 9న బి.కొత్తకోటలో సీపీఐ శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన ఆ పార్టీ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ 99 వసంతాలు పూర్తి చేసుకుని వందో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని బి.కొత్తకోటలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్య దర్శి రామక్రిష్ణ, తదితరులు హాజరవుతారన్నారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మహేష్, తోపు క్రిష్ణప్ప, సుమిత్రమ్మ, సాంబశివ, మురళి, సుధీర్, చిన్నయ్య, జక్కల వెంకటేష్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయం.. భక్తులతో కిటకిట


పూర్ణకుంభాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు


సూర్య ప్రభపై భద్రకాళీ సమేత వీరభద్రస్వామి


ఆలయానికి చేరుకున్న పండితారాధ్య శివాచార్యులు

రాయచోటి టౌన్: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి, అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అంతకు ముందు వేద పండితులు బళ్లారి పీఠాధిపతి ఓంకార్‌స్వామి ఆధ్వర్యంలో ప్రమథ గణ హోమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవారిని సూర్య ప్రభ వాహనంపై కొలువుంచారు. పట్టణంలోని మార్కెట్ వీధి, గాంధీ బజార్ బ్రాహ్మణ వీధి గుండా ఊరేగించి ఆలయానికి చేర్చారు.

పల్లకిలో శివాచార్యుల ఊరేగింపు

అడ్డ పల్లకిలో శ్రీశైలం 1008 జగద్గురు డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారధ్య భగవత్ పాదుల శివాచార్యులు శనివారం వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో డీవీ.రమణారెడ్డి ఘన స్వాగతం పలికారు. అడ్డ పల్లకీలో ఆయనను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు.

నేడు మహా నైవేద్యం సమర్పణ

బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామికి ఆదివారం మహా నైవేద్యం సమర్పిస్తారు. వరి అన్నం, రకరకాల వంటకాలు, కూరగాయలను సంప్రదాయబద్ధంగా రావిగా పోస్తారు. వడియ రాజులతో కొల్లగొట్టే కార్యక్రమం నిర్వహి స్తారు. ఈ వేడుక చూసేందుకు కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు ప్రాంతాలభక్తులు తరలివస్తారు. ఈ ఒక్క రోజే 2 లక్షల మంది దర్శించుకుంటారని అధికారుల అంచనా.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతం

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, కాకతీయ (షిర్డిసాయి), గీతాంజలి, నలంద జూనియర్ కళాశాల్లో పరీక్షలు ప్రాశాంతంగా జరిగాయి. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

రైల్వేకోడూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, ఎస్వీ, గురుదేవా వశిష్ఠ జూనియర్ కళాశాలల్లో జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఎగ్జామ్స్ కస్టోడియన్ శారధ మాట్లాడుతూ 903 మంది రాయాల్సి ఉండగా, 847మంది హాజరయ్యారన్నారు.

సిద్దవటం: మండల శివారులోని జేఎంజే కళాశాలలో ఇంటర్ మీడియట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయని ఛీఫ్ ఎగ్జామినర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 474 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 463 మంది హాజరయ్యారని తెలిపారు. పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలి రోజున ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పకడ్బందీగా నిర్వహించేందుకు సీసీ కెమేరాలు ఏర్పాటుచేసినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు.

రామాపురం: మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలలో భాగంగా శనివారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షకు డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల, ఆదర్శ కళాశాలల నుండి 171 మందికి గానూ 161 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ చీఫ్ శ్యామలాదేవి తెలిపారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరం


ప్రశంసాపత్రం అందజేస్తున్న సభ్యులు

చిన్నమండెం: శాంతి సమాజ నిర్మాణానికి విలువలతో కూడిన విద్య అవసరమని మానవతా సంస్థ ఛైర్మన్ జయచంద్రారెడ్డి అన్నారు. చిన్నమండెం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో నైతిక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి నేటి విద్యార్థులే ఆనాటి భావిపౌరులన్నారు. అనంతరం 9, 10వ తరగతుల విద్యార్థినులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపి, ఆవిటాల రామానుజన్‌రెడ్డి, అల్లం రెడ్డప్పరెడ్డి, వెంకటరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు గాలికుంటు టీకాలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జేడీ గుణశేఖర్

వీరబల్లి: ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశువులకు గాలికుంట వ్యాధి టీకా వేస్తున్నట్లు పశు వైద్య శాఖ జేడీ డాక్టర్ గుణశేఖర్ తెలిపారు. మట్లి పంచాయతీలో ఆయన టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య సిబ్బందితో జేడీ మాట్లాడుతూ గ్రామాలలో క్రమ తప్పకుండా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.

రాజంపేట రూరల్: పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులుడాక్టర్ కె.ప్రతాప్ కోరారు. మండలంలోని ములక్కాయపల్లిలో పశువులకు శనివారం గాలికుంటు టీకాలు వేశారు. ఏడీఏ ప్రతాప్ మాట్లాడుతూ గాలికుంటు నివారణ టీకా వేయించుకుంటే పాలదిగుబడి తగ్గుతుందనే అపోహవద్దన్నారు. టీకాలు పశువులకు మేలు చేస్తాయన్నారు.

చిన్నమండెం: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద మూగ జీవాలకు గాలికుంటు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ గణేష్ తెలిపారు. మండలంలోని బలిజపల్లెలో శనివారం గాలికుంటు టీకాలు వేశారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకూ టీకాలు వేస్తామన్నారు.

శుభాల వసంతం.. రంజాన్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి


జి శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: రంజాన్ మాసం శుభాల వసంతమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రంజాన్ మాసంలోనే పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించిందన్నారు. రోజా (ఉపవాస వ్రతం) ఆరాధనను దైవం ఈ మాసంలోనే నిర్ణయించినందున ఈ మాసానికి పవిత్రత ఉందన్నారు. నెలరోజులపాటు భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాసాలు చేయడం మహా పుణ్య కార్యమన్నారు. పవిత్ర రంజాన్ మాసం మానవాళికి శాంతి సందేశం అందిచాలని కోరారు. ఉపవాస దీక్షలకు, ప్రత్యేక ప్రార్థనలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్తు, మున్సిపాలిటీ శాఖలు చొరవ చూపాలని వారు కోరారు. ముస్లిం సోదరులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

ఉపవాసం.. పుణ్యకార్యం


సయ్యద్ ముస్తాక్

పుల్లంపేట: పవిత్ర ఖురాన్ అవతరించిన రంజాన్ మాసంలో ముస్లింసోదరులు కఠోర ఉపవాసాలు చేయడం మహా పుణ్యకార్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్ అన్నారు. ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం మానవాళికి శాంతి సందేశం అందించాలని, అందరి ఇంటా సుఖ శాంతులు నిండాలని కోరారు.

పవిత్రమైనది రంజాన్ మాసం


కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం భక్తి శ్రద్ధలతో అల్లాహ్‌ను ప్రార్థిస్తారన్నారు. రాష్ట్రంలోని రైతులు, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని అల్లాహ్‌ను ఆయన కోరుకున్నారు.

వేతన జీవులను విస్మరించిన బడ్జెట్

రాజంపేట రూరల్: వేతనాలు పెరుగుతాయని ఎదురుచూసిన వారిని రాష్ట్ర బడ్జెట్ నిరాశ పరిచిందని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఇ.సిఖిందర్ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జీవో ఇవ్వకుండానే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అంగనవాడీలకు గ్రాట్యుటీ అమలుచేసిన ఘనత మాదేనని చెప్పుకోవడం తగదన్నారు. ఆశా వర్కర్ల జీతాల పెంపు ఊసే లేదని, ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. అన్ని వర్గాలను నీరుగార్చే బడ్జెట్‌గా చరిత్రలో మిగిలిపోతుందన్నారు. ఈ సమావేశంలో నాగేశ్వరరావు, పి.సుబ్రమణ్యం, జమాల్, రమణ, రమేష్, మస్తాన్, బలరామ్, విటల్, వెంకీ, కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి తోడ్పాటులేని బడ్జెట్

రాజంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమానికి ఏ మాత్రం తోడ్పడదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారిని నిరాశపరిచిందన్నారు. ప్రాజెక్టులకు నిధులు కేటాయించక పోవడం దారుణమన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అన్నమయ్య, ఫింఛా డ్యాములు నిర్మాణానికి నిధులివ్వకపోవడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. ఈ సమావేశంలో కొత్తనాని, రమేశ్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

జోనల్ అధ్యక్షుడిగా భరత్ కుమార్ రెడ్డి

ఓబులవారిపల్లె: రైల్వే కోడూరు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ జోనల్ అధ్యక్షుడిగా తల్లెం భరత్‌కుమార్ రెడ్డిని నియమించారు. గుంతకల్లు రైల్వే బోర్డు వినియోగదారుల కమిటీ సభ్యుడిగా భరత్ కుమార్‌రెడ్డి గతంలో పనిచేశారు. తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తానని భరత్ తెలిపారు.

ఎన్‌జీఓ సంఘం మాజీ అధ్యక్షుడు మృతి


సుబ్బన్న (ఫైల్)

రాజంపేట టౌన్: ఎన్‌జీఓ సంఘం మాజీ అధ్యక్షుడు వేంపల్లె సుబ్బన్న (85) శనివారం మృతి చెందాడు. రాజంపేట తాలూకా అధ్యక్షుడిగా ఆయన సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోనేగాక రాష్ట్రంలోనూ గుర్తింపు తెచ్చుకోవడంతోపాటు ఉద్యోగుల హృదయాల్లో ముద్ర వేసుకున్నారు. సంఘం నాయకులు శెట్టెం వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, వరదయ్య, వెంకటసుబ్బయ్య, రమేష్ సుబ్బన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

రాజగోపాల్ మృతి తీరనిలోటు

రామాపురం: మండలంలోని కర్ణపువాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకులు రాజగోపాల్ రెడ్డి మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. రాజగోపాల్‌రెడ్డి భౌతికాయాన్ని శనివారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు పరామర్శించారు. రమేష్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

ఈవో రాకతో నైవేద్యం ఆలస్యం

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామ స్వామికి శనివారం నైవేద్యం ఆలస్యమైంది. టీటీడీ ఈఓ శ్యామలరావు శనివారం ఒంటిమిట్ట ఆలయానికి విచ్చేశారు. రోజూ ఉదయం 10.30 నుంచి 11.15 గంటల మధ్యం నైవేద్యం సమర్పించాల్సి ఉంది. ఈవో దంపతులచే బాలాలయంలో పూజలు జరిపించారు. దీంతో 11.15 తర్వాత నైవేద్యం సమర్పించాల్సి వచ్చింది.

ప్రధాన మంత్రిని ఆహ్వానించండి

ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో సీతారాముల కల్యాణానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించాలని ఒంటిమిట్ట సీనియర్ బీజేపీ నాయకుడు పాటూరు గంగిరెడ్డి కోరారు. రెండో అయోధ్యగా కీర్తిగడించిన ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయానికి వచ్చిన టీటీడీ ఈవో శ్యామలరావును శనివారం ఆయన కలిసి కోరారు. ఆయన స్పందించి తప్పక ఆహ్వానిస్తామని తెలియజేశారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పనులను చిత్రీకరించేందుకు వెళ్లిన సాక్షి విలేఖరి వెంకట కృష్ణపై దాడి చేసిన కాంట్రాక్టర్ కృష్ణమూర్తిపై చర్యలు తీసుకోవాలని మండల విలేకరులు కోరారు. వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన టీటీడీ ఈఓ శ్యామలరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన స్పందించి విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరిపై దాడి అన్యాయం

ఒంటిమిట్ట మండల సాక్షి విలేకరి వెంకటకృష్ణపై దాడి చేయడం అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి కె నరసయ్య అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ కోదండరామ స్వామి ఆలయంలో జరిగే పనుల ఫొటోలు తీసి వార్త రాసేందుకు వెళ్లిన వారికి స్వేచ్ఛ లేకుండా దాడి చేయడం మంచిది కాదన్నారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.